# రక్తదానం

ఓ.ఎస్.సూరి



"మదర్ సీరియస్ స్టార్ట్ ఇమీడియట్లీ" అని తండ్రి ఇచ్చిన టెలిగ్రామ్ చూసుకుని వెంటనే భార్యని తీసుకుని బయలుదేరాడు చంద్రం.

అతని మనస్సంతా ఆందోళనతో నిండిపోయింది. ఇంత హఠాత్తుగా ఏమయ్యిందో తల్లికి? ఏ అనారోగ్యమూ లేకుండానే పరిస్థితి అంతలా విషమించటానికి కారణం ఏమిటో?

చంద్రం మనసు పరిపరివిధాల పోయింది.

అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

రైలు వేగంగానే వెళ్తోంది. కాని చంద్రానికి మాత్రం అది నత్తనడకలా అనిపిస్తోంది. తల్లిని గురించిన ఆలోచనా— ఆందోళనా అతనికి ఎలా అనిపిస్తున్నాయంటే అమాంతంగా రైలు నుంచి దూకి రయ్యిమని పరిగెత్తి వూరు చేరుకోవచ్చునేమో ననిపిస్తోంది.

"ఇదిగో అక్కడ మీరు దుడుకుతనం చూపించి విపరీతంగా ఖర్చు చేయక్కర్లేదు ఇంకా మీ అన్నయ్యలు కూడా ఉన్నారు అది గుర్తుంచుకోండి!" అంటూ భుజంమీద చేత్తో పొడుస్తున్న అరుణ మాటలకి అతను ఆలోచన్ల నుంచి తప్పుకుని ఇవతలకు వచ్చాడు. ఆమె మాటలు అస్పష్టంగా వినపడటంచేత "వూఁ?" అన్నాడు చంద్రం.

"అమ్మగారి ఆరోగ్యం గురించి మీరొక్కరే ఖర్చు చేయనక్కర్లేదూ . ఇంకామీ అన్నయ్యలున్నారంటున్నాను"—

అరుణ అంది.

చంద్రానికి ఏదో అనటానికి నోటి వరకూ వచ్చింది. కాని అనలేదు. "ఛీ" అనుకుని వూరుకున్నాడు ఆమె మనస్తత్వానికి.

మొదట్నుంచి ఆమె తత్త్వం అంతే. అత్తగార్ని శత్రువులా చూసింది. ఆవిడ తన ఆనందానికీ—స్వేచ్ఛకీ అడ్డుగోడనన్నట్లు ఫీలవుతుందామె.

అందుకనే ఎన్నోసార్లు చంద్రం తల్లిని తన దగ్గర వుంచుకుందామని తీసుకువచ్చి భార్య సాధింపులూ—పోరు పడలేక తండ్రి దగ్గరకు పంపేశేవాడు.

పోనీ తల్లి అత్తగారి పెత్తనం ఏదైనా చేసేదా అంటే ఆవిడ కసలు నోట్లో నాలుకే లేదు. కోడలనే భావమే కనబరిచేది కాదు.

తన తల్లి పట్ల భార్య చూపించే విముఖతని మార్చాలని చాలాసార్లు ప్రయత్నించాడు చంద్రం. అది బూడిదలో పోసిన పన్నీరే అయ్యింది.

అటువంటి విషయం ప్రస్తావించినప్పుడు కీచులాటలూ — కోపగించుకోవటాలూ ప్రారంభమయ్యేవి ఇంట్లో. చంద్రానికి శాంతి లేకుండా పోయేది.

పోనీ నెలనెలా తల్లికోసం జీతంలో వదో పరకో పంపిద్దామనుకుంటే దాని కోసం పెద్ద వాదన వేసుకుని కూర్చునేదామె.

"ఈ వయసులో ఎందు కావిడకు డబ్బా? చీరలు కొనుక్కోవాలా? సినిమాలకు వెళ్ళాలా? . . కొడుకులందరు పంపేన డబ్బుని కూడబెట్టడమేగా? అలా కూడబెట్టినది వాళ్ళకే పంచుతుందావిడ చివరకు? అంటే దాచుకున్నట్లు అవుతుంది మనం? అంతకంటే బ్యాంకులో అయితే వడ్డీ వస్తుందిగా? చూడండి మరేం ఆవిడకు డబ్బు పంపక్కర్లేదు కాని ఆ ఖర్చు పెట్టేది ఏదైనా వుంటే ఆవిడ అవసరానికే పెద్దురుగాని వూరుకోండి" అనేది అరుణ పెద్దగా ఉపన్యాసం దంచుతూ.

అది జ్ఞాపకంవచ్చి భార్యంటే అసహ్యం వేసింది చంద్రంకి.

అలా అన్నది టెలిగ్రామ్ మాట చెప్పి తన దగ్గరున్న డబ్బు ఇమ్మంటే నానా గందరగోళం చేసింది.

"బాగానే వస్తాయి మనకి తద్దినాలు పదివేలు కట్నం తీసుకుని మీ వాళ్ళు ఓ బంగారపు పోగైనా పెట్టక పోయినా నాలుగు డబ్బులు పొదుపుచేసి చెవులకు దుద్దులైనా చేయించుకుందా మను కున్నాను ఛీ ఛీ " అంటూ గుడ్ల నీరు కుక్కుకుంటూ తన పెట్టిఅడుగున దాచిన డబ్బులో కొంత తీసుకునివచ్చి చేతిలో పడేసింది.

ఆ క్షణంలో చంద్రానికి ఆ డబ్బు గొంగళిపురుగుల్లా కంపరాన్ని కలిగిం

చింది. కాని పరిస్థితికి తలవంచి సంభా ళించుకున్నాడు.

"ఇదిగో అక్కడ మనమేం ఎక్కువరోజు ఉండక్కర్లేదు పరిస్థితి చూసి వెంటనే చక్కా వచ్చేద్దాం. లేకపోతే ఆ వెధవ నౌకరీ అంతా నా నెత్తిన పడ్తుంది" అరుణ అంది మళ్ళీ భర్తని పొడుస్తూ.

చంద్రం ఆమె మాటలంటే విన్నాడు కాని సమాధానం చెప్పలేదు. కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు.

భార్య మాటలు అతనికి వెలపరాన్ని — వెగటుని కలిగిస్తున్నాయి. తను కట్టుకున్న ఆడది అంత హీనమైన మనస్తత్వం కలదీ అనుకుంటే చాలా సిగ్గుగా వుంటుందతనికి.

పెళ్ళిచూపులో ఆమె అందాన్ని చూసి ముచ్చటపడి వెంటనే ఒప్పేసుకున్నాడు చంద్రం ఆ తర్వాత ఆమె రూపం అంత అందమైనది కాదా మనసు అని తెలుసుకున్న నిముషంలో తను తీవ్రంగా భంగపడినందుకు చాలా బాధ పడ్డాడు.

నిజానికి అరుణ తన అందాన్ని సంరక్షించుకోవటానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేది. ఆమెకు స్నోలూ పౌడర్లూ సెంట్లూ ఎక్కువగా కావల్సి వచ్చేవి. అది చూసి చంద్రం—

"ఏమిటరుణా ఈ ఖర్చులు మనకి తగుతాయా?" అని అంటే మూడురోజులు ముడుచుకుని పడుకునేది. పైగా భర్తని క్రీమ్ క్రీములు రాసుకోమనీ షాంపూతో స్నానం చేయమని పోరుపెట్టేది. అతను వద్దంటున్నా రకరకాల డిజైన్స్‌లో షర్టులు కుట్టించేది. చంద్రానికి చాలా సిగ్గనిపించేది.

"చేసే గుమాస్తా ఉద్యోగంలో ఇన్ని వేషాలు వేస్తే ఏం బావుంటుంది అరుణా? ఆఫీసులో నవ్వుకోరూ?" అనేవాడు అతను.

"అందుకని జిడ్డోడుతూ వుంటారా? ..నా కలాంటి మగాళ్ళంటే అసహ్యం బాబూ" అనేదామె.

చంద్రం ఏం మాట్లాడగలడు?


తన ఖర్మంతే అని మాట్లాడేవాడు కాదు.

చంద్రానికి ఎప్పుడు వూరు చేరతానా అనిపించసాగింది. ఈ పాటికి అన్నయ్యలందరూ వచ్చేవుంటారు. ఒకలా ఫర్వాలేదు కొంతవరకూ వాళ్ళు చూసుకుంటూంటారు. వదినలు తన భార్యంత చెడ్డవాళ్ళు కాకపోయినా వాళ్ళూ కొడళ్ళేగా?

అమ్మకు కూతురుంది ..ఆ కూతురు అమెరికాలో వుంది.

చంద్రానికి అక్కయ్య ఆమె.

ఎక్కడో దూరంగా మరో దేశంలో వుందామె. అమ్మకి ఇలా వుందని తెలిస్తే ఎంత ఆందోళన పడుతుందో- ఎంత బాధపడుతుందో.




ఆమెకి కేబుల్ ఇచ్చారో లేదో?

చంద్రం భార్యవైపు చూశాడు. తన మీదకు వాలి హాయిగా నిద్రపోతుందామె

"ఎంత నిశ్చింతగా వుంది. ఇదే కనుక తనవాళ్ళకి ఎవరికైనా జరుగుంటే తనకి వూపిరి సలుపనిచ్చేదా?"

చంద్రం అనుకున్నాడు.

మనుష్యుల మనస్తత్వమే అంత. ఎదుటివాడి బాధని తన బాధగా అనుకోలేకపోవటం- ప్రతీ విషయంలోనూ తనా-పర బేధం చూపించటం మానవుల్లో వుండే మాన్చుకోలేనటువంటి బలహీనతలు.

రైలు అనకాపల్లి చేరుకుంది.

ఇంటికి చేరాక తెలిసింది తల్లి పెరట్లో బావిదగ్గర కాలుజారి పడిందనీ- తలకి బలమైన గాయం తగిలితే హాస్పటల్లో జాయిన్ చేశారని.

తల్లిని చూసేందుకు వెంటనే హాస్పిటల్‌కు బయలుదేరాడు చంద్రం.

"మీరు వెళ్ళండి నాకు ప్రయాణం చేసి బడలికగా వుంది. తర్వాత వచ్చి చూస్తాను." అంది అపణ భర్త పిలిచినప్పుడు.

తండ్రి ముందూ- అన్నల ముందూ ఆ సమాధానానికి సిగ్గుపడిపోయాడు చంద్రం. వాళ్ళే కనుక ఎదురుగా లేకపోతే ఆమెని దవడ వాచిపోయేలా కొట్టాలనిపించింది అతనికి.

చంద్రం హాస్పిటల్‌కు వెళ్ళాడు.

బెడ్‌మీద కట్లుతో పడుకున్న తల్లిని చూసేసరికి అతనికి మనసు ద్రవించిపోయింది. అతనికి కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి.

స్పృహలో లేకుండా పడుకున్న తల్లిని చూస్తూ "అమ్మా నేను వచ్చానమ్మా" అన్నాడు చంద్రం చిన్నపిల్లాడిలా దుఃఖం ముంచుకు వస్తూంటే.

ఆ సాయంకాలానికి తల్లికి కాంప్లికేషన్స్ ప్రారంభం అయ్యాయి. ఆవిడ మంచం చుట్టూరా చేరారంతరూ. అందరి మనస్సుల్లోనూ ఆవేదన- అందరి కళ్ళల్లోనూ ఆరాటం.

డాక్టరొచ్చి పరీక్షించాడు.

అర్జెంటుగా ఆవిడకు రక్తం ఎక్కించాలనీ. లేకపోతే ప్రాణాలు దక్కడం కష్టమనీ చెప్పాడాయన.

"ఎంత ఖర్చయినా ఫర్వాలేదు డాక్టర్ రక్తం తెప్పించి ఎక్కించండి." చంద్రం ప్రాధేయపూర్వకంగా అన్నాడు డాక్టర్ తో.

అన్నలు కూడా అదేమాట అన్నారు.

అరుణ నిప్పులు కురిసేలా చూసింది.

కాని బ్లడ్ బ్యాంక్ లో ఆ గ్రూపు రక్తం లేదు. అంతకు ముందు డొనేట్ చేసిన ఒకరిద్దరికి ఫోన్ చేస్తే వాళ్ళు వూళ్ళో లేరని జవాబొచ్చింది.

చంద్రం తల్లి పరిస్థితి విషమిస్తోంది.

"ఒకవేళ మాలో ఎవరిదైనా సరిపోతుందేమో చూడండి డాక్టర్." అన్నాడు చంద్రం అన్నగారు.

"అవున్సార్ ప్లీజ్ అలా సరిపోతుందేమో చూడండి" చంద్రం ఆవేశంగా అన్నాడు.

"మీరోసారి ఇలా వస్తారా?" అంది అరుణ రుసరుసా భర్త వైపు చూసి వరండాలోకి వెళ్తూ.

అందరూ చంద్రంవైపు చూశారు.

చంద్రం తలొంచుకుని అవతలికి నడిచాడు.

వరండాలో దూరంగా నుంచున్న భార్య దగ్గరకు వెళ్ళాడు అతను.

"మీకేమైనా మతిపోయిందా? కాటికి కాళ్ళు చాచుకుని కూర్చున్న ఆవిడకు రక్తం ఇచ్చి మీ ఆరోగ్యానికి ముప్పు తెచ్చుకుంటారా? మీ కేమైనా అయితే నా గతేమిటి? ఏమైనా సరే మీరు రక్తం ఇవ్వటానికి వీల్లేదు!" మొహం కందగడ్డలా చేసుకుని గొంతు చించుకుంది అరుణ.

అంతే మరుక్షణంలో ఆమె చెంప అదిరిపోయింది.

చంద్రం కళ్ళు నిప్పులు కురవసాగాయి.

"రాక్షసీ ఎవరనుకుంటున్నావ్ ఆవిడ? నా తల్లి నాకు తన రక్తంతో రూపం ఇచ్చిన తల్లి నా రక్తం ఒకటే కాదు ఈ మాంసం ఈ ఎముకలూ ఈ చర్మం సమస్తం ఆవిడ నించి వచ్చినవే. అటువంటి తల్లికి కొడుకునుంచి వీటన్నింటిని వాపసు తీసుకునే హక్కు జన్మాంతం ఉంటుంది తెల్సా? కాని ఏ తల్లీ అలా



అడగరు అందుకు ఒప్పుకోదు అమ్మకూడ స్పృహలో వుంటే తన రక్తం తను వాపను తీసుకోటానికి ఒప్పుకోదు. కాని అడగకపోయినా ఇవ్వటం ఆ రక్తం పంచుకు పుట్టిన వాళ్ళ బాధ్యతా ధర్మం!

ఇవన్నీ తెలిసి నువ్వు ఆడదానివి ఎలా అయ్యావో తెలీటం లేదు" అంటూ తల్లి దగ్గరకు వెళ్ళిపోయాడు చంద్రం.

అరుణ గుడ్ల నీరు కక్కుతూ నిలబడిపోయింది. మనుష్యులకు స్వార్థం వుండొచ్చు కాని శాస్త్రయినా త్యాగం లేకపోతే ఎలా!